సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం। 19। ఆగస్టు। 2023



బలి పశువులు

విలువైన పశుసంపదను భారీ ఎత్తున తరలిస్తున్నారు. అడపాదడపా పట్టుబడుతున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. 8లో



పత్తి పంట పరిశీలన..

కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పలు ప్రాంతాల్లో పత్తి పంటలను పరిశీలించి, రైతులకు తగిన సూచనలు చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 23°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఉదయం అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నది.

న్యూస్‌రీల్

రామాలయంలో 'శ్రావణ' పూజలు



సామూహిక కుంకుమార్చనలో లక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రావణ మాస పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయంలోని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో ఉదయం ప్రత్యేక స్నపనం, పంచామృతంతో అభిషేకం జరిపారు. అనంతరం సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. కాగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్య కల్యాణం ఘనంగా జరిపారు.

వైభవంగా పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

నేడు మైనారిటీ బంధు చెక్కుల పంపిణీ

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ బంధు పథకంలో భాగంగా 140 మందికి శనివారం రూ. 1.40 కోట్ల చెక్కులను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ అధికారి సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాలకు చెందిన 140 మందికి కొత్తగూడెం ఉర్దూఘర్‌లో చెక్కులు పంపిణీ చేయనున్నారు. కాగా జిల్లావ్యాప్తంగా ఈ పథకానికి 4 వేల మంది మైనారిటీలు దరఖాస్తు చేసుకున్నారు.


గొత్తి కోయలకు అండగా ఉంటాం



గొడుగులు పంపిణీ చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీ గంగమ్మతల్లి కాలనీలోని గొత్తికోయలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గొడుగులు పంపిణీ చేశారు. పిల్లలకు పలకలు, బలపాలు అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ కాలనీలోని 25 కుటుంబాలను కలిశామని, వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పెద్దన్న కుమార్, ఎస్‌ఐ సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్ తరగతులు..



రికార్డులను పరిశీలిస్తున్న డీఐఈఓ

బూర్గంపాడు/భద్రాచలం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఎంసెట్, నీట్ తరగతులు బోధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈఓ) సులోచనా రాణి సూచించారు. బూర్గంపాడు, భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల అటెండెన్స్, టీచింగ్ డైరీ, కేర్‌టేకర్ షీట్స్, ప్రోగ్రెస్ కార్డ్స్, యాన్యువల్ ప్లాన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలల్లో చేరేందుకు ఈ నెల 31వరకు గడువు ఉందని, అడ్మిషన్లు పెంచాలని, విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. ప్రిన్సిపాల్ చీన్యా, అధ్యాపకులు సీహెచ్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ కుమార్, పీవీవీఎన్ మూర్తి, ముకుందం, నరేష్, సాహితి, జరీనా, భాను, రేష్మ, శ్రీలత, దీపిక, లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలతోనే సరి!

కేఎస్ఎం కళాశాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ హామీ

- రూ.75 కోట్లతో అభివృద్ధికి నిపుణుల ప్రతిపాదనలు
- ఆరు నెలలైనా పైసా విడుదల చేయని ప్రభుత్వం
- శిథిలావస్థకు చేరిన ఇంజనీరింగ్ కాలేజీ భవనాలు



ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల భవనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సాంకేతిక విద్యపరంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మరో గొప్ప అవకాశం లభించింది. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీకి అనుబంధంగా పాలేరు నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇదే ఒరవడిలో నలభై ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల(కేఎస్ఎం)కు నిధులు మంజూరు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

400 ఎకరాల్లో 1976లో కళాశాల ఏర్పాటు

సింగరేణి బొగ్గు గనులకు ప్రధాన కార్యాలయం ఉన్న కొత్తగూడెంలో 1976లో 400 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేశారు. గతంలో ఓయూలో కొనసాగుతున్న విభాగాన్ని పారిశ్రామిక అవసరాల దృష్ట్యా కొత్తగూడెం తరలించారు. అప్పటినుంచి 1994 వరకు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కేఎస్ఎం పాలనా వ్యవహారాలు కొనసాగాయి. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి మారింది. మైనింగ్‌తో పాటు ఈఈఈ, కంప్యూటర్ సైన్స్ విభాగాలను అందుబాటులోకి తెచ్చారు. సెల్ఫ్ ఫైనాన్స్ కింద ఈసీఈ, ఐటీ కోర్సులను ప్రవేశపెట్టారు. అన్ని విభాగాల్లో కలిసి 250 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు 2001 నుంచి ఎంబీఏ, ఎంసీఏ వంటి పీజీ కోర్సులు కూడా ఈ కాలేజీలో అందుబాటులోకి తెచ్చారు. కాగా గతంలో కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ -కేఎస్ఎంగా పిలిచిన ఈ కళాశాలను ప్రస్తుతం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూసీఈ-కేయూ)గా పేర్కొంటున్నారు.

ఐడీఓసీ ప్రారంభోత్సవంలో అభివృద్ధికి సీఎం హామీ

కొత్త కోర్సులు ప్రారంభించడంలో కనిపించిన పురోగతి మౌలిక సదుపాయాల కల్పనలో లేకుండా పోయింది. దీంతో వందల సంఖ్యలో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్న కాలేజీ భవనాలు, హాస్టల్ సముదాయాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ల్యాబోరేటరీలు శిథిలావస్థకు చేరాయి. కళాశాల అకడమిక్ బిల్డింగ్, బాలికల హాస్టల్ సముదాయమైన రుద్రమాదేవి భవనం, ఆడిటోరియం, గతేడాది ప్రారంభమైన బాలుర హాస్టల్ తప్ప మిగిలిన నిర్మాణాలన్నీ ఉపయోగించడానికి వీలులేని విధంగా మారిపోయాయి. ఈ యేడాది జనవరి 12న జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ) ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం కేసీఆర్ కేఎస్ఎం కళాశాల సమస్యలను తెలుసుకున్నారు. కాలేజీ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

రూ.75 కోట్లతో ప్రతిపాదనలు

సీఎం కేసీఆర్ సూచనలను అనుసరిస్తూ ప్రొఫెసర్ గోపాల్ నాయక్(సివిల్ ఇంజనీరింగ్, ఓయూ), ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి(మెకానికల్, జేఎన్టీయూ), పీ రామయ్య(కేయూ)తో నిపుణుల కమిటీని 2023 ఫిబ్రవరిలో నియమించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసిన కమిటీ సభ్యులు రూ. 75 కోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటితో కాలేజీ ప్రస్తుత అవసరాలు తీరడమే కాకుండా భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు.

రూపాయి ఇవ్వలే..

నిపుణుల కమిటీ కాలేజీ అవసరాల కోసం రూ.75 కోట్లు అవసరమని చెప్పింది. ఇందులో అత్యవసరంగా రూ.51.31 కోట్లతో కొన్ని పనులు చేపట్టాలని సూచించింది. అప్పుడే ఇక్కడ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొంది. సీఎం హామీ ఇచ్చి ఏడు నెలలు, నిపుణుల కమిటీ నివేదిక వచ్చి ఆరు నెలలు గడిచినా నేటికీ కాలేజీ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. మరోవైపు మెడికల్ కాలేజీ, కొత్త కలెక్టరేట్ నిర్మాణాల కోసం కాలేజీకి చెందిన వంద ఎకరాలకు పైగా భూమిని ప్రభుత్వం వినియోగించుకుంది. కనీసం ఈ భూములకు సంబంధించిన పరిహారం విడుదలైనా కాలేజీ కష్టాల్లోంచి గట్టెందుకు ఆస్కారం ఉండేది.

జిల్లా ప్రజాప్రతినిధులు కృషి చేస్తే..

ఎన్నికలకు మరో రెండు మూడు నెలల సమయమే ఉండటంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వం దూకుడు పెంచింది. అందులో భాగంగా వందల కోట్ల నిధులను కేటాయిస్తోంది. ఇల్లెందు, అశ్వారావుపేట ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసింది. జిల్లా ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్, పువ్వాడలు రెగ్యులర్‌గా టచ్‌లోకి వస్తున్నారు. ఈ క్రమంలో కేఎస్ఎం సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేలా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నూటొక్క కోటి..

దరఖాస్తులు 5,059.. ఆదాయం రూ.101.14 కోట్లు..



- మద్యం టెండర్ల ద్వారా 'ఫుల్లు'గా ఆదాయం
- దుకాణాల నిర్వహణకు దరఖాస్తుల వెల్లువ
- పెద్దమ్మగుడి, దమ్మపేట షాపులకు పోటాపోటీ
- అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ

కొత్తగూడెంఅర్బన్: మద్యం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరింది. మద్యం దుకాణాల నూతన టెండర్లకు దరఖాస్తులు పోటెత్తాయి. చివరి రెండు రోజుల్లో అధిక సంఖ్యలో దాఖలు కాగా, అధికారులు అర్ధరాత్రి వరకు స్వీకరించారు. శుక్రవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సందడి నెలకొంది. ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసినా రద్దీ నెలకొంది. ఒక్కో దరఖాస్తుకు రూ. 2 లక్షల చొప్పున డీడీలు చెల్లించారు. మొత్తం 5,057 దరఖాస్తులు రాగా, సుమారు 101.14 కోట్ల ఆదాయం లభించింది. స్వీకరణ సాయంత్రం ఆరు గంటలకే ముగుస్తుందని ప్రకటించిన అధికారులు, ఆలోపు క్యూలైన్‌లో ఉన్న వారందరికీ టోకెన్లు ఇచ్చి రాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించారు. కొందరు సిండికేట్‌గా దరఖాస్తులు చేశారు. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెంచే దరఖాస్తులు కావడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 1,063, పాల్వంచ 723, అశ్వారావుపేట 869, భద్రాచలం 1137, మణుగూరు 623, ఇల్లెందు స్టేషన్ పరిధిలో 642 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. చివరి రోజు శుక్రవారం 2,314 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

గతేడాది కంటే ఎక్కువే

గత ఏడాది కంటే ఈసారి మద్యం దుకాణాలకు దరఖాస్తుల సంఖ్య పెరిగింది. జిల్లాలో 88 మద్యం దుకాణాలు ఉండగా, 5,057 దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది ఇవే షాపులకు 4,271 దరఖాస్తులు దాఖలయ్యాయి. క్రితం సంవత్సరం కంటే 786 దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. అత్యధికంగా పెద్దమ్మ గుడి(పాల్వంచ) ఆలయ సమీపంలోని వైన్ షాపునకు 124, దమ్మపేట వైన్‌షాపునకు 96 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య తెలిపారు. కాగా చాలా మంది సెంటిమెంట్‌గా పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న షాపునకు మొదట ఒక దరఖాస్తు వేసి, అనంతరం మిగిలిన షాపులకు దరఖాస్తులు వేయడంతో 124 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. 88 మద్యం షాపుల్లో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు 44 కేటాయించగా, మిగిలిన 44 దుకాణాల్లో 13 మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు లక్కీ డ్రా ద్వారా కలెక్టర్ ఖరారు చేశారు. ఇందులో గౌడలకు 6, ఎస్సీలకు 7 మద్యం దుకాణాలన ఎంపిక చేశారు. గౌడ కులస్తులకు గెజిట్ సీరియల్ నంబర్ 01, 03, 11, 21, 39, 79 కాగా, ఎస్సీలకు 10, 12, 13, 20, 36, 43, 82 నంబర్ దుకాణాలు ఎంపికయ్యాయి. ఈ మొత్తం దరఖాస్తులకు ఈ నెల 21వన పాల్వంచలో లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆ వైన్‌షాపునకు 2.48 కోట్లు..

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని పెద్దమ్మగుడి సమీపంలో ఉన్న మద్యం దుకాణానికి వ్యాపారులు పోటాపోటీగా దరఖాస్తు చేశారు. 124 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ గుర్నాథ్ రాథోడ్ తెలిపారు. జిల్లాలో అత్యధికంగా ఇక్కడే దరఖాస్తులు దాఖలయ్యాయి. దరఖాస్తుకు రూ. 2 లక్షల చొప్పున టెండర్ల ద్వారానే రూ.2.48 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది. వ్యాపారులకు సెంటిమెంట్‌తోపాటు ఇక్కడ మద్యం విక్రయాలు అధికంగా ఉండటంతో దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. గతేడాది ఇదే షాపునకు 92 దరఖాస్తులు రాగా, ఈ సారి 27 దరఖాస్తులు పెరిగాయి.



ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుదారుల సందడి

పారదర్శకంగా విచారణ

'గృహలక్ష్మి' సమావేశంలో కలెక్టర్ ప్రియాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై విచారణ పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 86,773 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 17వ తేదీ వరకు 51 వేల దరఖాస్తులు విచారణ ప్రక్రియ పూర్తైందని, అర్హుల, అనర్హుల జాబితా సిద్ధం చేయాలని వివరించారు. విచారణ పూర్తైన దరఖాస్తులను ప్రత్యేక బృందాలు ర్యాండమ్‌గా తనిఖీ చేయాలన్నారు. అర్హుల జాబితా ను నిర్ణీత ప్రొఫార్మాలో నింపి, ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. విచారణ నివేదికలు ప్రత్యేక అధికారులు, ఆర్డీఓల ధృవీకరణతో అందించాలన్నారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న కోటి వృక్షార్చన కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ఐడీఓసీలో పంచాయతీ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో 948 ప్రదేశాల్లో 4 లక్షల 85 వేల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు.

నేడు 5కే రన్

కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించే 5 కే రన్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక కోరారు. అన్ని శాఖల సిబ్బంది, ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, నియోజకవర్గ ప్రజలు పాల్గొనాలని చెప్పారు. 5 కే రన్ నిర్వహించే మార్గాలల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని చెప్పారు.

పథకాలు అందేలా చూడాలి

అర్హులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర శాఖల ప్రధాన కార్యదర్శులతో కలిసి తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం, 2వ విడత గొర్రెల పంపిణీ, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. బీసీ, మైనారిటీలకు ఆర్థికసాయం పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ ప్రక్రియకు సంబంధించి జిల్లా కమిటీ స్క్రూటినీ పూర్తి చేయాలన్నారు. సోషల్ వెల్ఫేర్ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. వివిధ శాఖల అధికారులు కిష్టాగౌడ్, విద్యాలత, రమాకాంత్, సంజీవరావు, ఇందిర, అనసూర్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ'కి ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్ పూర్తైన విద్యార్థుల నుంచి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ విభాగంలో ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ దరఖాస్తులు స్వీకరిస్తామని, 23న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కొత్తగూడెం గౌతమ్‌నగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

శభాష్ లక్ష్మి...

- గిరిజన బాలికను అభినందించిన గవర్నర్ దత్తాత్రేయ
- హరియాణా రాజ్‌భవన్‌కు రావాలని ఆహ్వానం



పట్నా ఐఐటీలో లక్ష్మి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థిని కొర్సా లక్ష్మి బిహార్‌లోని పట్నా ఐఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్‌లో అభినందించి ఆతిథ్యం స్వీకరించేందుకు రాజ్‌భవన్‌కు రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు హరియాణా రాజ్‌భవన్ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. గిరిజనులైన కొర్స కన్నయ్య – శాంతమ్మ దంపతుల కుమార్తె లక్ష్మి బీద కుటుంబంలో జన్మించినా చదువులో ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మకమైన పట్నా ఐఐటీలో సీటు సాధించడంపై దత్తాత్రేయ అభినందించారు. లక్ష్మి తండ్రి ఇంటింటికీ తిరిగి ఐస్ క్రీం అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తుండగా, ఎస్సెస్సీలో 10 జీపీఏ సాధించిన లక్ష్మి, ఇంటర్ ఎంపీసీ భద్రాచలంలోని ట్రైబల్ గురుకుల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చదివి 992 మార్కులు సాధించింది. అనంతరం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1,371వ ర్యాంక్ సాధించగా పట్నా ఐఐటీలో ఈఈఈ సీటు లభించింది. ఆమె విజయం అందరికీ స్ఫూర్తిదాయకమని, సవాళ్లతో కూడిన కుటుంబ నేపథ్యంలోనూ తన ప్రతిభతో లక్ష్మి సత్తా చాటి అందరి హృదయాలను గెలుచుకుందని గవర్నర్ దత్తాత్రేయ అభినందించారు.

బీఆర్ఎస్ టీమ్ రెఢీ..

ఉమ్మడి జిల్లాలో పార్టీ అభ్యర్థుల జాబితా సిద్ధం

- సిట్టింగ్‌లు, పాత వారికే మళ్లీ గ్రీన్‌సిగ్నల్
- వైరాలో మాత్రం రాములునాయక్‌కు బదులు మదన్‌లాల్
- పొత్తు కుదిరితే సీపీఎంకు భద్రాచలం స్థానం!
- సర్వేలు, రాజకీయ సమీకరణలకు అనుగుణంగా ఖరారు
- ఈనెల 21న లేదా ఆ తర్వాత జాబితా.. చివరి క్షణాల్లో మార్పులకు అవకాశం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ స్థానాల నుంచి బరిలోకి దిగేందుకు బీఆర్ఎస్ టీమ్ సిద్ధమైంది. అన్ని స్థానాలకు అభ్యర్థులు ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. మారిన రాజకీయ సమీకరణలు, సర్వేల ఆధారంగా సిట్టింగ్‌లకు, మిగతా చోట్ల గతంలో పోటీ చేసిన వారినే మళ్లీ బరిలోకి దింపేలా నిర్ణయం జరిగినట్లు తెలిసింది. ప్రస్తుతానికి అందిన సమాచారం ప్రకారం వైరా మినహా మిగతా తొమ్మిది నియోజకవర్గాల్లో మార్పులు లేకుండా టికెట్లు ఖరారు చేసినట్లు సమాచారం. వైరాలో ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను పక్కన పెట్టి సర్వేల ఆధారంగా బానోతు మదన్‌లాల్ వైపు అధిష్టానం మొగ్గు చూపినట్లు తెలిసింది. ఈనెల 21న లేదా ఆ తర్వాత ఎప్పుడైనా ప్రకటించే బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలోని ఒక స్థానం మినహా అన్ని స్థానాల నుంచి బరిలోకి దిగే వారి పేర్లు వెల్లడవుతాయని సమాచారం. అయితే, ప్రాథమికంగా జాబితా ఖరారైనా చివరి నిమిషంలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది.

ఒక్కరు మినహా సిట్టింగ్‌లకు సై

తాజా సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఒక్కరు మినహా బీఆర్ఎస్‌లోని సిట్టింగ్‌లకు టికెట్లు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. పాలేరు నుంచి కందాల ఉపేందర్‌రెడ్డి, ఖమ్మంలో పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి నుంచి సండ్ర వెంకటవీరయ్య, పినపాక నుంచి రేగా కాంతారావు, అశ్వారావుపేట నుంచి మెచ్చా నాగేశ్వరరావు, ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియ, కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావు మళ్లీ బరిలో దిగనున్నట్లు తెలిసింది. అలాగే, మధిర, భద్రాచలం నుంచి గతంలో పోటీ చేసిన ఓడిపోయిన లింగాల కమల్‌రాజు, తెల్లం వెంకట్రావు పోటీకి దిగనున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో జరిపిన చర్చల్లో ఈ విషయమై స్పష్టత వచ్చింది. పలుమార్లు చేయించిన సర్వేల ఆధారంగా వీరే బలమైన అభ్యర్థులుగా తేలడంతో పోటీకి సిద్ధంగా ఉండాలని పార్టీ అధిష్టానం సంకేతాలు ఇచ్చింది.

రెండు స్థానాలపై ఆచితూచి..

ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలపై పార్టీ అధిష్టానం ఆచితూచి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్తగూడెం నుంచి వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియనే పోటీలో దింపేందుకు మొగ్గు చూపినట్లు సమాచారం. కాంగ్రెస్ నుంచి గెలుపొంది బీఆర్ఎస్‌లో చేరిన వీరికి ప్రస్తుత పరిస్థితుల నేపథ్యాన మళ్లీ పోటీకి సంకేతాలు ఇచ్చారని తెలుస్తోంది. ఇల్లెందులో గ్రూపుల కారణంగా సిట్టింగ్‌పై వ్యతిరేకత ఉన్నా ప్రతిపక్ష పార్టీకి హరిప్రియ మాత్రమే పోటీ ఇవ్వగలరనే నిర్ణయానికి అధిష్టానం వచ్చినట్లు సమాచారం. అయితే, ఈ స్థానానికి సంబంధించి చివరి నిమిషంలో మార్పులకు అవకాశం లేకపోలేదన్న ప్రచారం కూడా కొనసాగుతోంది.

ఇప్పటికైతే భద్రాచలం ఓకే..

కాంగ్రెస్ నుంచి ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన తెల్లం వెంకట్రావే పార్టీ అభ్యర్థిగా ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం, సీపీఐతో పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని సీపీఎంకు కేటాయించి, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెల్లంకు ఉన్నత పదవి కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు ఉభయ కమ్యూనిస్టులతో పొత్తుపై బీఆర్ఎస్ ఎటూ తేల్చకపోగా, తొలి జాబితా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యాన చర్చలు ఎప్పుడు జరుగుతాయో తెలియడం లేదు. తొలి జాబితా విడుదలయ్యేలోగా రెండు పార్టీలతో చర్చలు మొదలైతే భద్రాచలం స్థానాన్ని పెండింగ్‌లో పెట్టే అవకాశముంది. ఏదిఏమైనా కొన్ని నెలలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అభ్యర్థులపై కొనసాగుతున్న ఉత్కంఠకు అధిష్టానం త్వరలోనే తెరదించనుంది.

రాములునాయక్‌కు షాక్

ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలపై కసరత్తు చేసిన పార్టీ అధిష్టానం వైరా నుంచి సిట్టింగ్‌కు అవకాశం ఇవ్వలేదు. ఇక్కడ ఎమ్మెల్యే రాములు నాయక్‌ను కాదని బానోత్ మదన్‌లాల్‌ను బరిలో దింపాలని సర్వేల ఆధారంగానే నిర్ణయం తీసుకున్నారు. రాములునాయక్ గత ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాక బీఆర్ఎస్‌లో చేరారు. బానోత్ మదన్‌లాల్ గత రెండు పర్యాయాలు వైరా నుంచి పోటీ చేయగా.. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2018లో పోటీ చేసినా స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. అయితే, ప్రస్తుతం చేయించిన సర్వే ఆధారంగా మదన్‌లాల్ వైపే కేసీఆర్ మొగ్గు చూపినట్లు తెలిసింది.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పాపారావు తదితరులు

అశ్వారావుపేటరూరల్: ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ఆవిష్కరించి మాట్లాడారు. 14 ఏళ్లు నిండిన వారు 10వ తరగతిలో, 15 ఏళ్లు దాటిన వారు ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రవేశాలకు అవకాశం ఉందని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏసీఎంఓ

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ భద్రాచలం ఏసీఎంఓ రమణయ్య సందర్శించారు. విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, జాగ్రత్తలను వివరించారు. పరిసరాలు, వసతిగృహాలను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంటశాలలో చేస్తున్న వంటలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ జీసీడీఓ అలివేలు, హెచ్‌ఎం తోలెం వెంకటేశ్వర్లు, వార్డెన్ సౌజన్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో మిగిలిన ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 21న ఇల్లెందు వైటీసీ భవనంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ఎంపిక పోటీలకు 30 మంది హాజరు

ఖమ్మంస్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యాన ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీలో ఖాళీగా ఉన్న పదిహేను స్థానాల భర్తీకి శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన పోటీలకు నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 30 మంది అథ్లెట్లు హాజరయ్యారు. వారికి బ్యాటరీ టెస్ట్ నిర్వహించి అత్యధిక పాయింట్లు సాధించిన 14 మందితో జాబితాను శాట్స్‌కు పంపామని, అక్కడి నుంచి వచ్చే సమాచారం ఆధారంగా అకాడమీలో ప్రవేశం కల్పిస్తామని డీవైఎస్‌ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. పోటీలను రాజేశ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి, ఎస్.రాధాకృష్ణ పర్యవేక్షించగా, ఖమ్మం అకాడమీ కోచ్‌లు ఎండీ గౌస్, ఎండీ అక్బర్‌అలీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ షఫీక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు రూ.1.25 లక్షలు



చందా నగదును చూపుతున్న నిర్వాహకులు

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయనగర్‌లో గణేశ్ నవరాత్రులకు కోసం ఆలయం నిర్మించేందుకు ప్రముఖ విద్యావేత్త ఎంసీ నాగిరెడ్డి రూ.1.25 లక్షల విరాళం అందజేసినట్లు ఉత్సవాల నిర్వాహకులు పడిదెల నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కాకతీయనగర్‌లో గణేశ్ ఉత్సవాలు నిర్వహించే స్థలంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. దిండిగాల రాజేందర్, పులిగిళ్ల మాధవరావు, ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

బంగారు నాణేల పేరుతో మోసం

పాల్వంచ: బంగారు నాణేలు తక్కువ ధరకు ఇస్తామని నమ్మబలికి మోసం చేసిన ఐదుగురిపై పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. భద్రాచలానికి చెందిన పగడాల ప్రసాద్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి జిల్లా కూనవరం శిల్పినగర్‌కు చెందిన ఉప్పెన నరేశ్‌కుమార్ ఇటీవల ఫోన్ చేసి రూ.5 వేలకే తులం బంగారు నాణేలు ఇస్తామని నమ్మబలికాడు. నాణేలు కావాలంటే పాల్వంచకు రావాలని చెప్పాడు. ప్రసాద్‌రెడ్డి రూ.28 వేలు ఇచ్చి 6 బంగారు నాణేలు తీసుకున్నాడు. అవి బంగారు నాణేలుగా లేకపోవడంతో అనుమానం వచ్చి అడుగుతుండగా అటుగా వెళ్తున్న ఎస్‌ఐ స్వప్న వారిని పిలిచి ప్రశ్నించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నరేశ్‌కుమార్‌తో పాటు అతడి అనుచరులుగా ఉన్న బొమ్మనబోయిన వెంకటరమణ, శనగర రమేశ్, జంగాల సురేశ్, బత్తుల వెంకట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బలి పశువులు..



తొక్కిసలాటలో వాహనంలోనే చనిపోయిన పశువు (ఫైల్)

- గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటుతున్న పశువులు
- అడపాదడపా మాత్రమే పట్టుబడుతున్న వైనం..
- పశు సంపద రవాణా, వధపై చర్యలు అంతంత మాత్రమే

పాల్వంచ: నాడు పాడి పంటలు విరసిల్లాలంటే గ్రామాలు మొదలు పట్టణాల వరకు పశువులే కీలకంగా భావించేవారు. రైతులకు వ్యవసాయంలో కీలకంగా పశువులు చేదోడువాదోడుగా ఉండి వారి జీవనానికి తోడ్పడేవి. ఇక కొందరు పశువులను పాల ఉత్పత్తులు, ఇతర పనులకు పెంచుకునే వారు. పశువులు లేని ఇళ్లు ఉండేది కాదు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు పాల కోసం ముఖ్యంగా గేదెలు, ఆవులను పెంచేవారు. వ్యవసాయం కోసం ఎద్దులను పెంచేవారు. అలాంటి ఎంతో విలువైన పశుసంపద నేడు భారీ ఎత్తున వధకు తరలిపోతోంది. పశువులను పోషించడం ఏమాత్రం భారంగా అనిపించినా వెంటనే వధకు అమ్మేస్తున్నారు. చేతులు మారితే డబ్బులు సంపాదించవచ్చనే దురుద్దేశంతో పలు రకాలుగా ఉపయోగించుకుంటున్న వారికి పశువులను ఏజెన్సీ నుంచి నగరాలకు తరలిస్తున్నారు. నిత్యం అనేక వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలివెళ్లిపోతున్నా ఎవరూ పసిగట్టడం లేదు. అడపాదడపా మాత్రమే సమాచారంతో పట్టుబడుతున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

సరిహద్దులు దాటి..

ఏజెన్సీ భద్రాద్రి జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా భారీఎత్తున పశువులను కంటెయినర్లు, లారీలు, జీపులు, వ్యాన్‌లు, ఆటోల్లో ఇష్టారాజ్యంగా వరంగల్, హైదరాబాద్, ఆపై నగరాలకు, పట్టణాలకు తరలిస్తున్నారు. ఈ రవాణాకు ఉమ్మడి ఖమ్మం జిల్లా సెంట్రల్ పాయింట్‌గా ఉంటోంది. పశువుల తరలింపుపై ప్రత్యేక నిఘా లేకపోవడంతో వాటి అక్రమ రవాణా ఇష్టారాజ్యంగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయి. సమాచార వ్యవస్థ సైతం సరిగా పనిచేయక పోవడంతో పశుసంపద రానురాను కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. పశువుల తరలింపుకు ప్రత్యేక వాహనాలు సైతం నడుస్తుండటం గమనార్హం. ఎన్నిసార్లు పట్టుబడి కేసులు నమోదు చేస్తున్నా వాటికి అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు సైతం ఉన్నాయి. అక్రమ రవాణాలో భాగంగా పశువులను ఆయా వాహనాల్లో కుక్కి కుక్కి ఎక్కించి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో పశువుల మధ్య తొక్కిసలాట చోటుచేసుకుని అందులోనే చనిపోతున్నాయి. కొన్ని తీవ్రంగా గాయపడుతున్నాయి.

గోశాలకు భారీగా..

వివిధ మార్గాల్లో తరలిపోతున్న గోవులను పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు సంరక్షణ నిమిత్తం తీసుకొస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సైతం పట్టుబడిన వాటిని సంరక్షణ సమితికి తీసుకొచ్చి అప్పగిస్తున్నారు. ఒక్కోసారి సంరక్షణ సమితిపై లోడుపడుతోంది. వాటిని తీసుకొచ్చి సాకడం భారంగా మారుతోంది. ఈ క్రమంలో రైతులు ఉపయోగించుకునే విధంగా ఒప్పందం చేసుకుని పశువులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

గత మార్చి నుంచి పట్టుబడిన పశువుల వివరాలు..

- మార్చి 7వ తేదీన కల్లూరు పోలీసులు ఎలాంటి పత్రాలు లేకుండా రెండు లారీల్లో ఇచ్చాపురం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా సుమారు 110 గోసంతతిని పట్టుకున్నారు. వాటిని పాల్వంచ గోశాలకు అప్పగించారు.
- జూన్ 2న మూడు లారీల్లో హనుమాన్‌జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 139 గోవులను నూజివీడు రూరల్ పోలీసులు పట్టుకుని గోశాలలో అప్పగించారు.
- జూన్ 29వ తేదీన కొమురారం నుంచి ఖమ్మానికి 16 పశువులను వ్యాన్‌లో తరలిస్తుండగా ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు.
- ఇటీవల జక్కంపూడి నుంచి సూర్యాపేటకు తరలిస్తున్న ఆరు ఆవులు, ఐదు కోడె దూడలను కల్లూరు పోలీసులు పట్టుకున్నారు.
- చర్ల నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వాహనంలో తరలిస్తున్న 21 ఎద్దులను భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు.
- చర్ల నుంచి జనగామకు మూడు వాహనాల్లో 11 ఎద్దులు, 16 ఆవులు తరలిస్తుండగా దుమ్ముగూడెం పోలీసులు పట్టుకున్నారు.
- మోరంపల్లి బంజర నుంచి ఖమ్మానికి టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న రెండు ఆవులు, మూడు దూడలను ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు.
- చింతూరు నుంచి సంగారెడ్డికి కంటెయినర్‌లో తరలిస్తున్న గోవులను భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు.
- కొమురారం నుంచి ఖమ్మానికి 9 ఆవులు, 6 పెయ్యదూడలు, ఒక గిత్తను వ్యాన్‌లో తరలిస్తుండగా ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు.
- అనంతారం గ్రామం నుంచి వరంగల్‌కు 7 ఎద్దులను తరలిస్తుండగా కరకగూడెం పోలీసులు పట్టుకున్నారు.
- ఒడిశా నాగోల్ నుంచి హైదరాబాద్‌కు కంటెయినర్‌లో తరలిస్తున్న 54 వాహనాలను భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు.



వాహనాల్లో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన పశువులు (ఫైల్)

పశువుల రక్షణ ఎంతో అవసరం



గోసంపదను కాపాడుకోవడం ఎంతో అవసరం. ఇలాంటి పశువులను అక్రమ మార్గాన వధకు తరలిస్తుండటం బాధాకరం. ఈ చర్యలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అక్రమంగా తరలిస్తున్న గోవులను పట్టుకుని పోలీసులు గోశాలకు తీసుకొస్తున్నారు. వీటి సంరక్షణ భారంగా మారుతోంది.

–ఆంజనేయశర్మ, అన్నపూర్ణ సంరక్షణ సమితి నిర్వాహకులు

పశువుల రవాణా చట్టరీత్యా నేరం



పశువుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం. వాటిని హింసించడం, వధకు తరలించడం నిబంధనలకు విరుద్ధం. పశువులను తరలిస్తున్నట్లు సమాచారం ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. రవాణా చేయాల్సి వచ్చినా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. వీటిపై నిఘా పెట్టి అలాంటి రవాణాపై చర్యలు తీసుకుంటాం.

–వినయ్‌కుమార్, సీఐ, పాల్వంచ

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్



ప్రిన్సిపాల్‌కు రూ.2లక్షల చెక్కు అందజేస్తున్న జయశేఖర్ తదితరులు

బూర్గంపాడు: ప్రభుత్వ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని తానా మాజీ అధ్యక్షుడు, తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ తాళ్లూరి జయశేఖర్ ఆకాంక్షించారు. బూర్గంపాడులోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల(బాలికలు)లో మౌలిక వసతుల కల్పనకు శుక్రవారం ఆయన రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా జయశేఖర్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు పెంచుకుంటూనే కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా మంచి అవకాశాలు ఉంటాయని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావుతో పాటు వల్లూరిపల్లి వంశీకృష్ణ, గోనెల నాని, చావా లక్ష్మీనారాయణ, శ్యాం, పుష్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో టెండర్లు వాయిదా



వేలం పాటను పర్యవేక్షిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం మధ్య ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ సముదాయంలోని 12 షాపుల అప్పగింత, కొబ్బరిచిప్పలు, చీరల సేకరణ కోసం శుక్రవారం అధికారులు టెండర్ కమ్ వేలం నిర్వహించారు. అయితే, 4వ నంబర్‌షాపు మినహా మిగిలిన 11 షాపులు, చీరలు, కొబ్బరిచిప్పల సేకరణకు వ్యాపారులు ముందుకు రాకపోవడం ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఖమ్మం జిల్లా అధికారి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన వేలం నిర్వహించారు. ఈ మేరకు నాలుగో నంబర్ షాపు కోసం ఆరుగురు వ్యాపారులు పోటీ పడ్డారు. అత్యధికంగా నెలకు రూ.1.39 లక్షల అద్దె చెల్లించేలా జగన్నాథపురానికి చెందిన జి.గణేశ్ పాడడంతో షాపు కేటాయించారు. ఇక మిగతా షాపుల్లో కొన్నింటికి ఒకటే టెండర్ రావడం, మిగిలినవాటికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. అలాగే, కొబ్బరిచిప్పలు, చీరలు పోగు చేసుకునేందుకు కూడా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేశామని ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. వేలంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు, పాపయ్యదొర పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తెగుళ్ల నివారణపై సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

సుజాతనగర్: పత్తిలో తెగుళ్లు సోకుతున్నాయన్న సమాచారంతో కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పలు ప్రాంతాల్లో పంటలను పరిశీలించారు. సుజాతనగర్ మండలం మర్రితండా గ్రామంలో ఎండుతెగులు సోకిన పత్తి పంటను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంటకు ఎండు తెగులు, ఆల్టర్నేరియా స్టెమ్ బ్లైట్ తెగులు ఆశించినట్లుగా గుర్తించామని తెలిపారు. ఎండుతెగులు నివారణకు లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు కలిపి తెగులు సోకిన మొక్క చుట్టూ నేలపై పోయాలని, ఆల్టర్నేరియా స్టెమ్ బ్లైట్ తెగులు నివారణకు లీటర్ నీటిలో ఒక మి.లీ. ప్రొపికొనజోల్ మందు కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్. విశ్వతేజ, శివ, వాతావరణ విభాగం పర్యవేక్షకులు సుమన్, ఏఓ జి.నర్మద, ఏఈఓ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కబ్జాకు యత్నం



స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాత్రికి రాత్రే అమ్మ వారి విగ్రహం ఏర్పాటు

కొత్తగూడెంటౌన్: కబ్జాకు కాదేది అడ్డు అన్నట్లుగా దేవస్థానం భూమికే ఎసరుపెట్టారు. సుమారు రూ.కోటి విలువైన 800 గజాల స్థలాన్ని కబ్జా చేయాలని నిర్ణయించుకుని అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయితే, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఈ కబ్జాను అడ్డుకున్నారు. వివరాలు.. సింగరేణి సంస్థ 1981లో రైటర్‌బస్తీలోని శ్రీగణేశ్ దేవాలయ నిర్వహణ కోసం కొత్తగూడెంలోని మధురబస్తీలో 0.27 ఎకరాలను కేటాయించింది. ఇందులో కాంప్లెక్స్ కట్టి అద్దెకు ఇవ్వగా ఇంకా రూ.కోటి విలువైన 800 గజాల స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలాన్ని కొన్నేళ్లుగా గణేశ్ విగ్రహాలు తయారు చేసే వారికి ఆలయ నిర్వాహకులు అద్దెకు ఇస్తున్నారు. ప్రస్తుతం ఎవరూ లేకపోవడంతో స్థానికులైన ప్రేమ్, విద్య స్థలాన్ని ఇటీవల కబ్జా చేసేందుకు యత్నించగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. గురువారం రాత్రి కూడా వివాదం జరిగింది. అయితే, శుక్రవారం తెల్లవారుకల్లా ఈ స్థలంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. తొలుత ఇలా చేసి ఆ తర్వాత స్థలాన్ని ఆక్రమించాలనే ఆలోచన ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో స్థానికులు గుర్తించి చేరుకునే సరికి వాగ్వాదం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు చేరుకుని ప్రేమ్, విద్యను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఘటనపై ఆలయ కమిటీ సభ్యుడు శ్రీరామరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



పాపన్నకు నివాళులర్పిస్తున్న ఇందిర తదితరులు

కొత్తగూడెంరూరల్: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై అట్రాసిటీ కేసు

కరకగూడెం: మండలంలోని సమత్‌భట్టుపల్లి గ్రామానికి చెందిన కొమరం లక్ష్మీకాంత, తన భర్త ఇంద్రయ్యను అదే గ్రామానికి చెందిన దంపతులు అకారణంగా కులంపేరుతో దూషించి కర్రలతో తీవ్రంగా గాయపర్చారని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో కరకగూడెం ఏఎస్‌ఐ పాపయ్య శుక్రవారం సదరు దంపతులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కేసు నమోదు చేశారు. మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

స్నేహితుడికి సాయంగా వెళ్లి కరెంట్‌కు బలి

విద్యుదాఘాతంతో సివిల్స్ శిక్షణార్థి మృతి



ప్రవీణ్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: జీవితంలో అత్యున్నత స్థాయికి చేరాలనుకుని ఢిల్లీలో సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటున్న ఆ యువకుడి కలలను కరెంట్ ఛిద్రం చేసింది. సరదాగా రెండు రోజులు స్నేహితుడితో గడుపుదామని వచ్చిన ఆయన స్నేహితుడి పనిలో సాయంగా వెళ్లి షాక్‌తో మృతి చెందాడు. వివరాలు.. పాల్వంచకు చెందిన భూక్యా ప్రవీణ్ (23) ఢిల్లీలో ఉంటూ సివిల్స్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఖమ్మంలో ఆయన స్నేహితుడైన బానోత్ శ్రీనివాస్ ఉండగా, ఆయనతో రెండు రోజులు గడపాలని ఈ నెల 15న వచ్చాడు. కాగా, ఫ్లెక్సీ బోర్డుల తయారీ షాపులో పనిచేసే శ్రీనివాస్ ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు గురువారం వెళ్తుండగా ప్రవీణ్ కూడా బయలుదేరాడు. ఖమ్మంలోని మమత రోడ్డులో భవనం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ తీగలు తాకి ఇద్దరు షాక్‌కు గురయ్యారు. దీంతో స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అలాగే, తీవ్ర గాయాలైన శ్రీనివాస్ చికిత్స పొందుతున్నాడు. ఘటనపై ప్రవీణ్ తండ్రి ప్రేమ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భద్రాచలంఅర్బన్: షార్ట్ సర్క్యూట్‌తో గ్రామ పంచాయతీకి చెందిన చెత్త సేకరించే ఆటో దగ్ధమైన ఘటన శుక్రవారం చర్లరోడ్డులో చోటుచేసుకుంది. చెత్త సేకరణకు వెళ్లిన ఆటో ఇంజన్ నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్, సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ ఆటో ముందు భాగం పూర్తిగా దగ్ధమవడంతో రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారులు అంచనా వేసి వివరాలు నమోదు చేశారు.

డెంగీతో వ్యక్తి మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

కరకగూడెం: డెంగీ జ్వరంతో మండల కేంద్రానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ(58) మృతి చెందాడు. వారం రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతుంటే ఆయన్ను కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు.

ప్రమాదవశాత్తు వృద్ధుడు...

దమ్మపేట: గుట్ట పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బొల్లిగట్టు గ్రామానికి చెందిన పెనుబల్లి చిన బసవయ్య (75) గ్రామ శివారులోని గుట్టపైకి గత నెల 30న మేకలను మేత కోసం తీసుకెళ్లాడు. గుట్ట పైనుంచి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారికిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కాగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చినబసవయ్య గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు.

యువకుడు అనుమానాస్పద...



రవి (ఫైల్)

దమ్మపేట: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని మొద్దులగూడెం – ముష్టిబండ గ్రామాల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామంలోని కొత్తపేటకు చెందిన తమ్మిన రవి (28).. దమ్మపేట నుంచి సత్తుపల్లి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముష్టిబండ గ్రామ శివారు దాటి మొద్దులగూడెం క్రాస్ రోడ్డును సమీపించే సమయంలో గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో రవి కిందపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు చెబుతున్నారు. కాగా, ఈ ఘటనపై ఎస్‌ఐ రవికుమార్‌ను వివరణ కోరగా.. అనుమానాస్పద మృతిగా భావించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

అశ్వారావుపేటరూరల్: మామిడి చెట్టుపైనుంచి అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అచ్యుతాపురానికి చెందిన కిన్నెర చెన్నారావు మామిడి కాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. అదుపుతప్పి పైనుంచి కింద పడగా గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జూదరులు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని బ్యాంకురోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,55,350 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ నాగరాజురెడ్డి వెల్లడించారు.